# మమతానురాగాలు

నాన్నని రెండు చేతులా గట్టిగా కౌగిలించుకోవాలని వుంది.

రెండు చెంపలూ ముద్దుపెట్టుకోవాలని వుంది.

కాదు... రెండు పాదాలూ కన్నీళ్లతో కడగాలని వుంది.

నాన్న నిజంగా తన పెళ్లికొప్పుకున్నాడంటే నమ్మలేకుండా వుంది.

"అనూ.. పెళ్లికార్డులొచ్చాయ్! ఎవరెవరికి పంపించాలో చూడండి! పోస్టాఫీస్‌కెళ్లి నేను స్టాంపులు కొనుక్కొస్తాను"

పెళ్లికార్డులు చూసి మురిసిపోయింది అనూరాధ.

తన పక్కన వరుడు చి. రవిరాజ్ అన్న పేరు! ఊహల్లో- కలల్లో రవిరాజ్‌తో చాలాసార్లు పెళ్లిచేసుకుంది- చాలాచోట్లకి హానీమూన్ కూడా వెళ్లొచ్చింది.

ఇప్పుడు నిజంగా పెళ్లి-

అదృష్టం పండింది. నాన్న రవిరాజ్‌తో పెళ్లికి వప్పుకున్నారు.

కులాలు, అంతస్తులూ, బంధువులూ, బాధ్యతలూ అన్నీ పక్కన పడేసి.. కారు డ్రైవింగ్ చేస్తున్న రవిరాజ్‌తో పెళ్లికొప్పుకున్న నాన్నంటే.. ఇరవై రెండేళ్లుగా ఉన్న ప్రేమ ఇరవైరెట్లు పెరిగిపోయింది.

తను బికామ్ చదివింది. మంచి కంపెనీలో ఉద్యోగం- రోజూ ఆఫీసుకెళ్లే ముందు బస్టాండ్లో బాస్‌గారి డ్రైవరు ఆయనింటికెళ్తూ తనని ఆఫీసులో డ్రాప్ చేసి వెళ్ళేవాడు. మొదట్లో 'ఏమో' అనుకుంది. తర్వాత 'ప్రేమేమో..' అనుకుంది. ఆ తర్వాత తనకే 'ప్రేమ' అని తెల్సింది!

రవిరాజ్ కూడా అంతే అన్నాడు.

కూతురు పెళ్లి సంబంధాల కోసం నాన్న ఆత్రపడిపోతూ తెగ తిరుగుతున్నప్పుడు నేను రవిరాజ్‌ని ఇష్టపడుతున్నానని తెగించి చెప్పేసింది.

నాన్న షాకవలేదు- కోప్పళ్లేదు- కొంపలు మునిగిపోతున్నట్లు అరచి గగ్గోలు పెట్టలేదు.

మర్నాడు బస్టాండుకొచ్చాడు. రవిరాజ్‌ని ఆదివారం సెలవు రోజున ఇంటికి రమ్మన్నాడు. అనూరాధ కథ పట్టుపరుపుమీద ముత్యాల దొంతరలా

దొర్లిపోయింది. పెళ్లికార్డులు అచ్చయి చేతిలోకొచ్చాయి.

ఇంత సులభంగా.. ఇంత శుభంగా ఈ ప్రోగ్రాం జరిగిపోతుందని అనూరాధే అనుకోలేదు.

నాన్న కార్డులిచ్చి ఎడ్రస్‌లు రాయమని అన్నారు.

తన ఫ్రెండ్స్ అందరి పేర్లూ రాసింది.

అమ్మనడిగి చుట్టాల పేర్లు ఎడ్రస్‌లూ రాసింది.

నాన్న ఫ్రెండ్స్ లిస్ట్ చేస్తూంటే.. టెన్త్ క్లాసు గ్రూప్ ఫోటోలో వున్న కొంపెల్ల కిరణ్ పేరు గుర్తొచ్చింది.

"పిచ్చేంటి.. వాడురాడు- మనం ఎవరో గూడా మర్చిపోయి వుంటాడు" అన్నాడు నాన్న నవ్వుతూ.

"నీ ఫ్రెండ్ కదా నిన్నెలా మర్చిపోతాడు?" అంది అనూరాధ.

"అమ్మలూ.. చిన్నప్పుడు వాడు నా ఫ్రెండ్ అని నేను గర్వంగా చెప్పుకుంటానేమో గానీ.. వాడు నన్ను గుర్తుపెట్టుకుంటాడా- ఇవ్వాళ పేరున్న సినిమా యాక్టరు. ఆంధ్ర దేశం అంతా నాలాంటి పరిచితులు ఎందరో ఉంటారు"

"మరే.. మనకో కార్డు దండగ" అంది అనూరాధ అమ్మ.

"కిరణ్ అంటే.. రవికి పిచ్చి ఇష్టం.." మన పెళ్లికి ఆయన రావచ్చు అని చెప్పాను... భలే థ్రిల్ అయిపోయాడు. పిలుద్దాం నాన్నా" అనూ గారాలు పోతూ అడిగింది.

"సరే.. ఎడ్రస్ రాయి.. సినిమా యాక్టరూ.. ఫిలిమ్ నగర్ అంటే వెళ్తుంది.. కానీ ఒక్కమాట చెప్పు మీ రవికి.. మా నాన్న కృష్ణుడు కాదు కుచేలుడూ... కిరణ్ మనింటికి రాడూ.. మనమే వెళ్దామని! అతని ఫోన్

నెంబర్ సంపాదించి, పెళ్ళయ్యాక.. రవికి చూపించడానికి తీసుకెళ్దాం" అన్నాడు నాన్న.

అనూరాధ 'సరే' అంది. ఎడ్రస్ రాసింది.

✦ ✦ ✦

ఆ సన్నటి గల్లీలో...

ఇంటి ముందే రోడ్డుమీద మూడు టెంట్లు వేసి వేదికా కుర్చీలు తెప్పించి వైభవంగా పెళ్లి చేస్తున్నాడు అనూరాధ తండ్రి.. రాజు వైపు చుట్టాలూ స్నేహితులూ తక్కువే..

అనూరాధ బంధువులూ పరిచితులూ అందరూ వచ్చారు. రోడ్ బ్లాకైపోయి, ఇటూ అటూ పోలేని వాళ్లు తిట్టుకుంటూ టిఫెన్ టెంట్‌లోకి వచ్చి.. శాస్తి చేస్తున్నామని ధ్యాసతో కసిగా తింటున్నట్లు కనిపిస్తోంది. పెళ్లికూతురు పెళ్లి కొడుకూ మాత్రం బిజీ బిజీగా పురోహితుడు చెప్పే తతంగాన్ని నిర్వర్తిస్తున్నారు. ఉండుండి పెళ్లి బాజాలు వీధిని అదరగొడు తున్నాయి. ఎవరు ఎవర్ని తిట్టుకున్నా ఎలా హేళన చేసినా వినిపించకుండా-

"చూసి చూసి అంత చదూకున్న పిల్లని కారు డ్రైవర్‌కిచ్చి పెళ్లి చేస్తున్నాడు"

"కట్నం ఇవ్వక్కర్లేదని కక్కుర్తి పడుతున్నాడు"

"కాదట ఈ డ్రైవరేదో అగాయిత్యం చేస్తే.. అప్రదిష్ట పాలవడం దేనికని పెళ్లి చేస్తున్నాడు"

వచ్చిన (రా)బంధువులు అనే అడ్డమైన మాటలూ వినిపించకుండా బాజాలు మిన్ను ముట్టాయి.

సడెన్‌గా నిశ్శబ్దం- నిశ్శబ్దాన్ని మించిన కోలాహలం.. అడ్డదిడ్డంగా

పెట్టిన స్కూటర్ల వెనక రోడ్ మొదట్లో ఒక ఖరీదైన కారు ఆగింది.

కొంపెల్ల కిరణ్ కారు దిగాడు!

ఆయనని చూడగానే కాళ్లు కళ్లూ కలయబడుతూ చుట్టుముట్టాయ్. అనుక్షణంలో జనం మధ్యలో నిలిచిపోయాడు.

“అరె కిరణ్‌గాద్రాభయ్” అంటూ మగాళ్లూ కుర్రాళ్లూ కదల్నీయ కుండా కంచె కట్టేశారు.

డ్రైవరూ మరో సహాయకుడు నవ్వుకున్నారు.. “సార్.. చెప్తే ఇనలేదు. పెల్లయినాక తీరిగ్గా రావల్సింది” అనుకున్నాడు.

కిరణ్ చిరాకు పడలేదు.. తన చుట్టూ మూగింది తన ఆడియన్స్- వాళ్లని పలకరిస్తే- షేక్ హాండిస్తే.. ఆటోగ్రాఫిస్తే వాళ్లు తన సినిమాలు చూస్తారు. తనకి మరిని సినిమాలు వస్తాయి.

మిగిలిన సినిమా ఫంక్షన్లలో అయితే గుంపులో గోవిందలా చికాకు వేస్తుంది గానీ.. ఇలాంటి చోట్ల చాలా సరదాగా.. ఎంజాయ్ చేస్తాడు.

“ఏందనాన్న గిట్లొచ్చినావ్.. గాడ పెల్లి కదా నీకు ట్రాఫిక్ లే- లేపెయ్ మంటావ్‌లే” ఇమిటేట్ చేస్తూ లేటెస్ట్ సినిమాలో కిరణ్ డైలాగ్ చెప్పాడు ఓ కుర్రాడు.

“భలే పట్టినవ్ తంబీ.. నా ‘వీధి గుండా’ సిన్మా సూసినవన్నట్లు- ఎట్లుంది”

“మంచిగుందన్నా...”

“వందరోజులు గ్యారంటీ”

“నీ వేషం మస్తుగుంది”

“సర్లే- సాయంత్రం వరకూ ఇక్కడే వుంటాం- పెల్లి చూసొస్తాం

అడ్డులెండి" అన్నాడు సహాయకుడు.

"మాకు ఆటోగ్రాఫ్ ఇయ్యాలి" అన్నాడింకో కుర్రాడు.

"ఇస్తాను పెళ్లి చూసి వచ్చాక..."

జనాన్ని దాటుకుని పెళ్లి మంటపానికి చేరటానికి కొంత ఇబ్బందే అయింది కిరణ్‌కి– అయినా ఇబ్బందేమీలేనట్లు నటించేశాడు.

పెళ్లి కూతురు తండ్రిని.. గుది గుచ్చి కౌగిలించుకున్నాడు.

కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి ఇద్దరికి.

పీటల మీద అనూరాధ రాజుకేసి చూసింది– అతని కళ్లలో ఆనందం ఆరాధన ఆశ్చర్యం వెలగటం గమనించి పులకించింది.

స్నేహితులిద్దరూ వాస్తవానికొచ్చారు.

"మీరు వస్తారనుకోలేదు"

"నీ మొహం కదూ! మీరేంట్రా సన్నాసీ.. నువ్వు అనాలి– ఏంటమ్మా.. మీ నాన్న ఇలా చెడిపోయాడు. నేను వీణ్ని సన్నాసీ అనేవాణ్ని. వీడు నన్ను ఏబ్రాసీ అనేవాడు. ఏరా మర్చిపోయావా? వీడి పేపరు కాపీకొట్టి నేను డిగ్రీ ఫెయిలయ్యాను. వాడి రాత బావుండి పాసయిపోయాడు. ఉజ్జోగం చేసుకుంటున్నాడు. నేనిలా సినిమా పిచ్చిలో పడిపోయాను"

అక్కడున్న అందరూ నవ్వారు.

అనూరాధకి, రాజుకి, పెళ్లి కూతురు తల్లిదండ్రులకి అతని మాటలకి నవ్వే స్థితి లేదు.

ఆనందంతో నోటమాట రావట్లేదు.

"పెళ్లి పూర్తయిపోయిందా?" అన్నాడు వాస్తవానికి తెస్తూ.

"ముహూర్తం అయిపోయింది... మీరు అక్షింతలు వేస్తే మంగళ

సూత్రధారణే!" అన్నాడు పురోహితుడు.

అంతవరకూ మహారాజులా వెలిగిపోతున్న అనూరాధ, రాజుల బాస్.. ఆ పందిట్లో తెలవెలపోయాడు.

పెళ్లికూతురు గమనించింది.

"మా ఇద్దరికీ బాస్.. అంకుల్" అంటూ కిరణ్‌కు పరిచయం చేసింది.

ఆయన్ని ఆదరంగా పలకరించాడు కిరణ్.

గంభీరమైన బాస్ ముఖం నవ్వులమయమయింది.

పెళ్లి కొడుక్కి పెళ్లి కూతురుకి అక్షింతలు వేసి, 10వేలు గిఫ్ట్ ఇచ్చాడు కిరణ్– "ఇది హనీమూన్‌కి, మీ బాస్ గారు పదిరోజుల్లీవ్ గిఫ్ట్ ఇస్తారు. ఏం సార్!"

బాస్ గొల్లున నవ్వి "సేంక్షన్డ్" అన్నాడు.

✢ ✢ ✢

కిరణ్ అంతవాడు కలుపుగోలుగా వచ్చి పెళ్లిని సదడి చేసినందుకు అందరికీ మధురమైన జ్ఞాపకంగా వుంది.

మిగిలిన వాళ్లకెలా వున్నా అనూ తండ్రికి మాత్రం అనూహ్యంగా ఉంది. తన ఇంటి పెళ్లికి అంత కళ రావటం.

కిరణ్‌కి తర్వాతెప్పుడో ఆఫీసునుంచి ఫోను చేసాడు.

"అంతస్థులు శాశ్వతం కాదురా... ప్రేమాభిమానాలు ముఖ్యం– కారు డ్రైవరని కస్సుబుస్సులాడకుండా నువ్ నీ కూతురికి ఇష్టమైన సంబంధ్ చేసావ్.. హేట్సాఫ్. దీని పేరు 'మమతానురాగం' అంతే" అన్నాడు కిరణ్.

పొంగిపోయాడు అనూరాధ తండ్రి...

